క్లుప్తంగా

నేడు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

మంచాల: ఈనెల 9న మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమ్మేళనానికి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, మండలంలోని గులాబీ శ్రేణులు తప్పక హాజరు కావాలని ప్రకటనలో కోరారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్



హనుమాన్ ఆలయంలో భక్తుల పూజలు

కడ్తాల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని జెడ్పీటీసీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్, సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లిలో వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన పూజలకు అతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు, పూజలు, అర్చనలు, హనుమాన్ చాలీసా పఠనం, హనుమాన్ గీతాలాపన, భజనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో రైతు బంధు మండల అధ్యక్షుడు వీరయ్య, సుధీర్‌రెడ్డి నర్సింహగౌడ్, కేశవులుయాదవ్, పర్వతాలు, రామకృష్ణ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పూలే విగ్రహావిష్కరణకు ఎంపీకి ఆహ్వానం



ఆర్.కృష్ణయ్యను సన్మానిస్తున్న వెంకటేశ్

కడ్తాల్: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జ్యోతీబాపూలే విగ్రహావిష్కరణకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్యను ఆహ్వానించారు. శనివారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో బీసీ సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్ ఎంపీని ఘనంగా సన్మానించారు. అనంతరం ఆవిష్కరణ కార్యక్రమానికి తప్పక హాజరవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దయ్యయాదవ్, విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ భాస్కర్, మల్లేశ్‌గౌడ్, నిరంజన్, లక్ష్మయ్య, సుధకార్‌గౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని రాంపూర్‌కు చెందిన రొయ్యల పుల్లయ్య (62) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ట్రస్టు సభ్యులచే శనివారం రూ.3వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోహన్‌రెడ్డి, నాగేశ్, నరసింహ, జానయ్య, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో లేగదూడ మృతి



లేగ దూడ కళేబరం

యాచారం: వీధి కుక్కల దాడిలో ఓ లేగదూడ మృత్యువాత పడింది. బాధితుడు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన మల్కాపురం బాలయ్య శనివారం తన వ్యవసాయ పొలంలో పశువులను కట్టి ఉంచాడు. సమీపంలోనే సంచరిస్తున్న వీధి కుక్కలు ఓ లేగదూడపై దాడి చేశాయి. దీంతో తీవ్రంగా గాయపడిన లేగదూడ అక్కడికక్కడే మృతి చెందింది.

గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతం

జీఎస్పీ మండల అధ్యక్షుడు అనంతయ్య

కొందుర్గు: గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తున్నామని పార్టీ జిల్లేడ్ చౌదరిగూడ మండల అధ్యక్షుడు అనంతయ్య అన్నారు. బీసీలకు రిజర్వేషన్ పెంచాలనే డిమాండ్‌తో బీఎస్పీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టింది. శనివారం ముష్టిపల్లి ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కోటి సంతకాల సేకరణకు గ్రామాల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, బాలయ్య, రాధాకృష్ణ, యాదయ్య, నర్సింలు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతం చేయండి

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

తలకొండపల్లి: ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని దేవుని పడకల్ శివారు ప్రాంతంలోని ఓ పంక్షన్ హాల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డితో కలిసి మాట్లాడారు. ఈ నెల 12న చుక్కాపూర్‌లో, 22న వెల్జాల్ గ్రామాల్లో నిర్వహించే సమ్మేళనాలకు భారీ జనసమీకరణ చేయాలని ఎమ్మెల్యే పార్టీ ముఖ్య నేతలకు సూచించారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. బ్యాంక్‌ల ద్వారా తీసుకున్న రుణాలతో పొదుపు మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎ ంపీపీ శ్రీనివాస్‌యాదవ్, జెడ్పీ కో ఆప్షన్ ఎండీ ముజీబర్ రహ్మాన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ, దశరథ్‌నాయక్, రైతుబంధు మండల కోఆర్డినేటర్ నర్సింహ, మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

బ్రిడ్జి నిర్మాణానికి వినతి

తలకొండపల్లి: మండల పరిధిలోని చీపునుంతల్లోని అమ్రాయి చెరువుకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చెన్నకేశవులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. అనుబంధ గ్రామాలు, తండాలకు బీటీ రోడ్డు వేయించాలని, అమ్రాయి చెరువు అలుగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వినతిపత్రంలో కోరారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, నిరుపేదలకు డబుల్ బెడ్రూంలు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల, సర్పంచ్ రమేశ్‌యాదవ్, సాయినాథ్, రామకృష్ణ, శ్రీరాములు, జంగయ్య, శ్రీశైలం, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలు నెరవేర్చని కేంద్రం

రాష్ట్రంలో అడుగుపెట్టే అర్హత కోల్పోయిన ప్రధాని: సీపీఐ

ఇబ్రహీంపట్నం: ఇచ్చిన హామీలు అమలు చేయని ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు రావొద్దని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కావలి నర్సింహ్మా అన్నారు. ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం ప్రధాని గోబ్యాక్ అంటూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నర్సింహ్మా మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా.. కాలయాపన చేసిన ప్రధానికి తెలంగాణలో అడుగుపెట్టే అర్హత లేదని మండిపడ్డారు. బీజేపీయేతర ప్రభుత్వాలను.. కేంద్రం ఇరుకున పెడుతోందని ఆరోపించారు. నిత్యావసరాల ధరలు పెంచుతూ.. దేశాన్ని అదాని, అంబానీలకు తాకట్టుపెట్టిందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నీలమ్మ, జిల్లా నాయకుడు లక్ష్మయ్య, మండల కార్యదర్శి యాదయ్య, రైతుసంఘం జిల్లా నాయకుడు శ్రీశైలం, రాజు, నర్సింహ్మా, శ్రీహరి, మారయ్య, చంద్రకళ, రాములమ్మ, విజయ్‌కుమార్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



మోదీకి వ్యతిరేకంగా నిరసనవ్యక్తం చేస్తున్న సీపీఐ శ్రేణులు

రాజా వస్తారని గుడిసెవాసుల ఎదురుచూపు

పోలీసుల జోక్యంతో సమావేశం వాయిదా

హయత్‌నగర్: సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా వస్తారని ప్రజలు గుమికూడడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా.. పోలీసుల జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని పాపయ్యగూడలో ఇటీవల పేదలు వేసుకున్న గుడిసెల వద్దకు రాజా వస్తున్నారన్న సమాచారంతో శనివారం గుడిసె వాసులు, పార్టీ కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. ఇదిలా ఉండగా.. సమీపంలోని పల్లవి ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్ఐ రాత పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో.. అక్కడ 144 సెక్షన్ అమలు లో ఉంది. విషయం తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకొని సీపీఐ నాయకులతో మాట్లాడారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున రాజా రాకను విరమింపజేయా లని కోరారు. ఈ మేరకు గుడిసె వాసులకు అవగాహన కల్పించారు. దీంతో పోలీసులకు తాము పూర్తిగా సహకరిస్తామని పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ హరిసింగ్ నాయక్, శేఖర్‌రెడ్డి హామీ ఇచ్చారు. రాజా పర్యటనను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడంతో అక్కడి పరిస్థితులు సద్దుమణిగాయి.



సీపీఐ నాయకులతో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే



యాచారం: ప్రధాని సభకు వెళ్లిన బీజేపీ శ్రేణులు



కడ్తాల్ నుంచి..

కమలనాథుల ఆశాభావం

- ప్రధాని బహిరంగ సభకు వెళ్లిన పార్టీ శ్రేణులు

యాచారం: అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపనల కోసం ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా.. యాచారం మండలం నుంచి బీజేపీ శ్రేణులు వెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని 24 గ్రామాల నుంచి వందలాది మంది కమలనాథులు.. ప్రధాని బహిరంగ సభకు వెళ్లారు. మోదీ సభతో రాష్ట్రంలో 2023 ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వమే రాబోతుందని ఆ పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: రాష్ట్ర రాజధానిలో జరిగిన ప్రధాని బహిరంగ సభకు, మండల కేంద్రం నుంచి ర్యాలీగా పలు వాహనాల్లో బీజేపీ శ్రేణులు వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాన్యనాయక్, నాయకులు భగీరథ్, సాయిలాల్, యాదగిరి, రెడ్యా, లక్ష్మణ్. శంకర్, మహేశ్, విజయ్, రవి, ప్రేమ్‌కుమార్, సాయిప్రభు, జోగ్యానాయక్, వెంకటేశ్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

మోదీ సభకు తరలిన బీజేపీ నాయకులు

ఆమనగల్లు: సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం నిర్వహించిన ప్రధాని ప్రజా బహిరంగ సభకు పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. పట్టణంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనాలలో మోదీ సభకు వెళ్లారు. సభకు వెళ్లిన వారిలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు లక్ష్మణ్, చెన్నకేశవులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హరిప్రసాద్, నాయకులు ప్రభాకర్, కేకే.శ్రీను, రాజు, లక్ష్మణ్, గిరియాదవ్, యాదగిరి, జగన్, కృష్ణయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుల కోసం పడిగాపులు

కడ్తాల్: మండల పరిధిలోని పల్లెచెలక తండా మీదుగా రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులు శనివారం నిలిచి పోవడంతో విద్యార్థులు పడిగాపులు కాశారు. యాచారం మండలం కొత్తపల్లి నుంచి ముద్వీన్ వరకు ఉన్న ఆర్టీసీ బస్సు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఎస్ఎస్‌సీ పరీక్షల సందర్భంగా విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా ఆర్టీసీ సర్వీసులు నడుపుతామని అధికారులు ప్రకటిస్తున్నా.. క్షేత్ర స్థాయిలో అమలు కావడంలేదు. ఇప్పటికైనా అధికారులు బస్సులు సమయానుసారంగా నడిపించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



బస్సు కోసం నిరీక్షిస్తున్న తండా విద్యార్థులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇబ్రహీంపట్నం: మంగల్‌పల్లి సబ్‌స్టేషన్ టీసీఎస్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొంగరకలాన్ పరిధిలో సరఫరా ఉండదని చెప్పారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్‌తో ఆరోగ్య ధీమా

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



చెక్కులు అందజేస్తున్న సర్పంచ్ అనురాధ

ఇబ్రహీంపట్నం రూరల్: ముఖ్యమంత్రి సహాయనిధి పథకంతో నిరుపేదలకు ఆరోగ్య ధీమా లభిస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌కు చెందిన రాఘవేందర్ అనారోగ్యానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్‌కు ఎమ్మెల్యే సిఫారసు చేయగా.. మంజూరైన రూ.24 వేల చెక్కును శనివారం లబ్ధిదారుడికి ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఒక వరమని, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఇలాంటి పథకం వారికి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీనివాస్, మహేందర్, నగేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగయ్య, నాయకులు సుధాకర్‌గౌడ్, మహేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆమనగల్లు: మాడ్గుల మండల పరిధిలోని కొల్కులపల్లి గ్రామానికి చెందిన గడెల రాజు, శవ్వ లక్ష్మమ్మకు సీఎం సహాయ నిధి నుంచి చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు శనివారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ బట్టు అనురాధ, ఎంపీటీసీ సభ్యుడు బాధితులకు చెక్కులను అందజేశారు.

ఉపాధ్యాయురాలి మృతి



సునీత మృతదేహం

ఇబ్రహీంపట్నం రూరల్: మానసిక ఇబ్బందులతో స్పృహతప్పి పడిపోయిన ఉపాధ్యాయురాలు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందింది. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ లక్ష్మీనారాయణ కథనం ప్రకారం.. యాచారం గ్రామానికి చెందిన కేశమోని వెంకటయ్యగౌడ్, లిక్కి సునీత(42) దంపతులు తుర్కయంజాల్‌లో నివసిస్తున్నారు. వీరు 2009లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. వివాహం అయిన ఏడాది నుంచే భర్త వేధింపులు మొదలయ్యాయి. రెండు రోజుల క్రితం భర్త ఆమెపై చేయి చేసుకున్నాడు. దీంతో ఆమె మానసికంగా ఇబ్బందులతో మృతి చెందిందని ఉపాధ్యాయురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

గడ్డిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్ దగ్ధం

కడ్తాల్: గడ్డలోడుతో వెళ్తున్న ట్రాక్టర్ విద్యుత్ తీగలు తగిలి దగ్ధమైన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వెలుగురాళ్ల తండాకు చెందిన ఓ రైతు నేరేళ్ల కోలు తండా నుంచి పశుగ్రాసం కొనుగోలు చేసి తీసుకువస్తుండగా మార్గమధ్యలో విద్యుత్ తీగలు తగిలి ట్రాక్టర్ దగ్ధమైంది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. స్థానికులు మంటలార్పేందుకు యత్నించిన సాధ్యం కాలేదు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ తీగలను సరి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



దగ్ధమైన ట్రాక్టర్

సత్వర న్యాయం అందించాలి

హస్తినాపురం: నిరుపేదలకు సత్వర న్యాయం అందించేందుకు రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు కృషి చేయాలని హస్తినాపురం డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కంచర్ల శివారెడ్డి అన్నారు. రంగారెడ్డిజిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా భారీ మెజార్టీతో విజయం సాధించిన పట్లోళ్ల మాధవరెడ్డిని శివారెడ్డి శనివారం కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బొల్లంపల్లి రాజేశ్, వినోద్‌కుమార్, శివారెడ్డి, సుమన్, చందు, మధు, తదితరులు పాల్గొన్నారు.



మాధవరెడ్డిని సత్కరిస్తున్న శివారెడ్డి తదితరులు

రక్తదానం.. ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న యువకులు

మొయినాబాద్: రక్తదానం చేయడమంటే ఇతరులకు ప్రాణదానం చేయడమేనని కాంగ్రెస్ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాబాద్ దర్శన్ అన్నారు. మొయినాబాద్‌కు చెందిన యువకుడు కావలి సిద్దు ముదిరాజ్ పుట్టినరోజు సందర్భంగా సిద్దన్న యువసేన ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. నగరంలోని ప్రీమియర్ వాలంటరీ బ్లడ్ బ్యాంక్‌కు 25 మంది రక్తదానం చేశారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన దర్శన్ మాట్లాడుతూ.. రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలను నిలబెట్టడానికి యువత ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, రవీందర్‌గౌడ్, యువకులు రామకృష్ణ, ఆంజనేయులు, నర్సింహచారి, సతీశ్, రాజేశ్, నవీన్, తరుణ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాయపోల్‌లో 'బలగం' ప్రదర్శన



బలగం చిత్రాన్ని తిలకిస్తున్న గ్రామస్తులు

ఇబ్రహీంపట్నం: సకుటుంబ కథా చిత్రం, బాంధవ్యాలను గుర్తుచేస్తూ ఇటీవల విడుదలైన బలగం సినిమాను రాయపోల్‌లో శనివారం రాత్రి ప్రదర్శించారు. గ్రామస్తుల కోసం సర్పంచ్ బల్వంత్‌రెడ్డి డిజిటల్ ప్రొజెక్టర్ ద్వారా జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో సినిమాను ప్రదర్శించారు. దీంతో గ్రామస్తులంతా తరలివచ్చి చిత్రాన్ని తిలకించారు. ఈ సందర్భంగా చిత్రంలోని సన్నివేశాలను తిలకిసూత్ పలువురు కన్నీటి పర్యంతమయ్యారు.

ప్రభుత్వ అసమర్థతతోనే పేపర్ లీక్

వైఎస్సార్ టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇబ్రహీం

షాద్‌నగర్: ప్రభుత్వ అసమర్థత, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ అయిందని వైఎస్సార్ టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇబ్రహీం ఆరోపించారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట టీ–సేవ్ పేరుతో వైఎస్సార్ టీపీ నేతలు రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇబ్రహీం మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ పై ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని ఆరోపించారు. గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక హామీలు మరిచారన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణ పాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం శ్రీను, నర్సింహ, రాము, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట వైఎస్సార్ టీపీ నాయకుల రిలే దీక్షలు

శాంతి స్థాపనకే 'రన్ ఫర్ జీసస్'

ఏసీపీ కుషాల్కర్

షాద్‌నగర్‌టౌన్: శాంతి స్థాపనే రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ఉద్దేశమని ఏసీపీ కుషాల్కర్ అన్నారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకొని శనివారం షాద్‌నగర్ పట్టణంలో క్రైస్తవులు రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని విజయనగర్ కాలనీలో ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నుంచి పట్టణ ముఖ్య కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కుషాల్కర్, పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జోసఫ్ అంజన్న, ఉపాధ్యక్షుడు డేనియల్, స్వామి, దాసు, అభిషేక్, అబ్రహం, శాంత సికిందర్, స్టీఫెన్ పద్మ, జంగారెడ్డి, జ్ఞాన ప్రకాశ్, ఐజాక్, బిల్లి గ్రాహం, ఎజ్కెల్, రాజేశ్, పుల్ల శ్రావణ్, లాజరస్, రంగన్న, భాస్కర్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.



రన్ ఫర్ జీసస్‌లో పాల్గొన్న ఏసీపీ, తదితరులు